ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 2 ఏప్రిల్ 2024



టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

కలెక్టరేట్, ఏప్రిల్ 1: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ సోమవారం పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీసు మీడియం హైస్కూల్‌లో ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సాగింది. మొదటిరోజున అన్ని సబ్జెక్టులు కలిసి 12,533 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. తెలుగు 2835, హిందీ 1683, ఇంగ్లీష్ 1617, గణితం 1350, ఫిజిక్స్ 2082, బయాలజీ 1872, సోషల్ 2040 పత్రాలను దిద్దారు. ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ పర్యవేక్షించారు.

సంగీత, సాహిత్యాల్లో విరాజిల్లే విజయనగరం

- ఆరోగ్యం బాగా లేకున్నా పైడితల్లమ్మే నన్ను రప్పించుకుంది
- గానకోకిల, పద్మభూషణ్ పి.సుశీల
- పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 1 : ఎంతోమంది గాయనీ, గాయకులు, కవులకు పుట్టినిల్లుగా ఉన్న ఈ నేల ఇప్పటికీ, ఎప్పటికీ సంగీత సాహిత్యాల్లో విరాజిల్లుతుందని గాన కోకిల, పద్మభూషణ్ డాక్టర్ పి.సుశీల అన్నారు. గురునారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం విజయనగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో సుశీలమ్మ సుస్వరాలు-మణిశర్మ మధురగీతాలు కార్యక్రమం జరిగింది. పి.సుశీల, సంగీత దర్శకుడు మణిశర్మ, లవకుశ సినిమాల్లో కుశడు పాత్రధారి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. సుశీలకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఇక్కడే పుట్టి పెరిగాను, ఈ నేల మీద చదువుకున్నాను. నాపై మీ ప్రేమ, అభిమానం మరువ లేనివి. నాలుగు రోజుల క్రితం ఇంట్లో తూలిపోయాను. 90 ఏళ్ల వయసు కావడంతో ఇబ్బంది పడ్డాను. రాలేనే అనుకున్నా.. కానీ ఆ .. పైడితల్లమ్మే నన్ను రప్పించుకుంది' అంటూ ఆనందం వ్యక్తం చేశారు. విజయ నగరం ఎంతోమంది కళాకారులకు పేరు ప్రఖ్యాతలు ఇచ్చిందని, ఇక్కడి యువత సంగీత, సాహిత్యంపై మక్కువ చూపించాలని ఆకాంక్షించారు. అనంతరం కొన్ని పాటలకు సంబంధించి ఒక్కో లైన్ పాడేందుకు ప్రయత్నించారు. శ్రావ్యంగా ఆలపించి మరోసారి అందరినీ అబ్బురపరిచారు.

● లవకుశ సినిమాల్లో కుశడు పాత్రధారి వియ్యూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ నేలపై సన్మానం పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపకులు బీఏ నారాయణ, డాక్టర్ సన్యాసమ్మ, పవన్‌చరణ్, సురభిశ్రావణి, హారికా తదితరులు గీతాలు ఆలపించారు.



సుశీలను సన్మానిస్తున్న సంగీత దర్శకుడు మణిశర్మ, నటుడు సుబ్రహ్మణ్యం

క్రీడలపై మక్కువ చూపాలి

- ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ క్రికెట్ టీం డైరెక్టర్ సౌరవ్ గంగూలి
- రాజాంలో మూడు గంటల పాటు సందడి చేసిన క్రికెటర్లు



మాట్లాడుతున్న సౌరవ్ గంగూలి

రాజాం రూరల్, ఏప్రిల్ 1: యువత చదువుతో పాటు క్రీడలపైనా మక్కువ చూపాలని డిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ క్రికెట్ టీం డైరెక్టర్ సౌరవ్ గంగూలి సూచించారు. రాజాంలోని జీఎంఆర్ఐటీలో ఐపీఎల్ క్రికెట్ టీం సభ్యులు, కోచ్‌లతో కలిసి సోమవారం మూడు గంటల పాటు సందడి చేశారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తొలుత డిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ మాట్లాడుతూ యువతలో క్రీడాభిమానం పెరుగుతోందని, క్రమశిక్షణతో కూడిన క్రీడలు ఎంతో అవసరమని గుర్తు చేశారు. మరో క్రీడాకారుడు అక్సార్ పటేల్ మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రమశిక్షణతో కూడిన క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిజ జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. క్రికెటర్లు ట్రిస్టాన్ స్టబ్బాస్, మిచెల్ మార్ష్, కుమార్ కుషాగ్రా, యష్ ధల్, అభిషేక్ పోరెల్, స్వస్తిక్ చికారా, లలిత్ యాదవ్, అసిస్టెంట్ కోచ్ ప్రవీణ్ ఆమ్రే, సలహాదారు వేణుగోపాలరావు తదితరులతో కలిసి టీం కళాశాల ప్రాంగణం అంతా పరిశీలించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన ఇంజినీరింగ్ విద్యార్థులకు బంగారు, వెండి, రజత, కాంస్య, రజత పథకాలతో పాటు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా క్రికెటర్లతో పాటు హెడ్‌కోచ్, కోచ్, సలహాదారు తదితరుల్ని కళాశాల యాజమాన్య ప్రతినిధులు బహుమతులతో సత్కరించారు. అంతకుముందు క్రికెటర్లు జీఎంఆర్ కుటుంబ సభ్యులు, కళాశాల సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి షీల్డు అందజేస్తున్న క్రికెటర్

బొత్స ఇలాకాలో ప్రలోభాలు

- వలంటీర్లకు గుట్టుగా డబ్బుల పంపిణీ
- రూ.5వేలు, ఇతర తాయిలాలు అందజేత
- ద్వితీయ శ్రేణి నాయకులకు బాధ్యతలు అప్పగించిన మంత్రి




చీపురుపల్లి/ విజయనగరం-ఆంధ్రజ్యోతి: వలంటీర్లకు ఎర వేసే తంతు చీపురుపల్లి నియోజకవర్గంలో తాజాగా జరుగుతోంది. మంత్రి బొత్స మార్గదర్శకంలో కొందరు నాయకులు ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల్లో వలంటీర్లతో వివిధ పనులు చేయించుకునే ఎత్తుగడలో భాగంగా అధికార వైసీపీ నాయకులు వారిని పూర్తిగా గుప్పిట్లో పెట్టుకునే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు నుంచే ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ డబ్బుల పంపిణీ జరిగింది. వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న జీతం కాకుండా అదనంగా రూ.5వేలు ఇస్తున్నారు. ఎస్.కోట, విజయగనరం, బొబ్బిలి తదితర నియోజకవర్గాల్లో ఏకంగా వలంటీర్లతో సమావేశాలు నిర్వహించి వారికి బాక్సుల్లో దుస్తులు, నగదు పంపకాలు చేశారు. అవి శాసన సభ్యుల ఆధ్వర్యంలోనే జరగటం విశేషం. పార్టీ అందించిన తాయిలాలనే పంపిణీ చేశారు. చీపురుపల్లి నియోజకవర్గంలో పంపకాల్లో కాస్త జాప్యం జరిగింది.

● ఇదివరకు చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స అందుబాటులో లేకపోయినా అంతా తానై చిన్న శ్రీను చూసుకునేవారు. బొత్సకు సంబంధించి ఎన్నికల నిర్వహణ నుంచి మంత్రి అధికారాలను సైతం చిన్న శ్రీనే హైజాక్ చేసి నడిపించే వారు. ఈ మధ్యకాలంలో ఏమైందో ఏమో కానీ ఇద్దరు నేతలూ ఎడమొహం పెడమొహం మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో వలంటీర్లకు తాయిలాలు అందించడంలో జాప్యం జరిగింది. ఇంతలో ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. ఈ తరుణంలో బొత్స నేరుగా వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేయకుండా మండల స్థాయిలోని ద్వితీయ శ్రేణి నాయకత్వానికి రూ.5వేలు నగదు, తాయిలాల పంపిణీ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. వలంటీర్లకు రహస్యంగా పంపకాలు జరుగుతున్నాయి.

● ఎన్నికల కోడ్ కారణంగా పంపకాల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. మండల స్థాయిల్లో పంపకాలు జరిగితే బహిరంగం అవుతుంది కాని అలా చేయకుండా మండలాల్లో ఉన్న రెండు లేదా మూడు పీఏసీఎస్‌ల పరిధిలో పంపకాలు చేస్తున్నట్లు సమాచారం. అది కూడా ఒక పీఏసీఎస్ పరిధిలో పంపకాలు చేసే కేంద్రానికి వేరే పీఏసీఎస్ పరిధి వలంటీర్లను రప్పిస్తున్నట్లు తెలిసింది. అలాగే స్థానికంగా ఉన్న గ్రామ నాయకులు కాకుండా వేరే వారి ద్వారా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. విడతల వారీగా రెండు మూడు రోజులు విరామం ఇచ్చి మరో పీఏసీఎస్ వద్ద తాయిలాలు అందిస్తున్నారు. మూడో కంటికి తెలియకుండా, ఎవరు ఎందుకు వస్తున్నది, వలంటీర్లా కాదా అన్నది కూడా తెలియనీయకుండా వ్యూహాత్మకంగా పంపకాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బెడిసికొట్టిన వ్యూహం

ఏప్రిల్ నెలకు సంబంధించి పించన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా చేపట్టి తర్వాత రాజీనామా చేయించి మే నెలలో వీరు లేకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలకు తెలియజేయాలని వైసీపీ ప్రభుత్వం భావించింది. అనూహ్యంగా ఎన్నికల సంఘం వారిని ఇప్పటి నుంచే దూరంగా ఉంచింది. దీంతో ప్రభుత్వం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పింఛను పంపిణీకి ఆదేశించింది. ఈ వ్యవహారంపై అధికారపార్టీ విష ప్రచారం చేస్తోంది. విపక్షాలపైకి నెడుతోంది.



తప్పుదారి

- వైసీపీ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్న డీలర్లు, వలంటీర్లు
- ఈసీ ఆదేశంతో కేసుల పాలు.. ఆపై సస్పెన్షన్‌లు
- భవిష్యత్‌లోనూ ఇబ్బందులుండొచ్చునని ఈసీ హెచ్చరిక

పక్క ఫొటోలో కనిపిస్తున్న ఆయన పేరు బుగత వెంకటేశ్వరరావు. ఎస్.కోట పట్టణ పరిధిలో ఓ రేషన్ దుకాణానికి డీలర్. మండలం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘం అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. అయితే పది రోజుల కిందట శృంగవరపుకోట పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన విశాఖ పార్లమెంటరీ వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీరాణి వెంట ఈయన కూడా ఉన్నారు. దీనిపై మార్చి 31 (ఆదివారం) కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. నిజమేనని నిర్ధారించుకున్న ఎన్నికల అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైంది.



శృంగవరపుకోట, ఏప్రిల్ 1: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ధిక్కరిస్తున్న డీలర్లు, వలంటీర్లపై ఎన్నికల సంఘం కఠిన చర్యలకు దిగుతోంది. బాధ్యత నుంచి తప్పించడమే కాకుండా పోలీస్ కేసులు పెడుతోంది. ఎస్.కోట మండలంలో ఇప్పటికే అలుగుబిల్లి డీలర్ రవ్వరాజు ఎన్నికల అధికారుల ఆగ్రహానికి గురవయ్యారు. ఇద్దరు వలంటీర్లు సస్పెండ్‌య్యారు. జిల్లా పరిధిలో పలు మండలాల్లో వలంటీర్లను ఇళ్లకు పంపారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందుతున్న వలంటీర్లు, రేషన్ దుకాణాల డీలర్లు ప్రజాసేవ (పబ్లిక్ సర్వెంట్) కేటగిరిలోకి వస్తారు. నిబంధనల ప్రకారం రాజకీయ కార్యకలాపాలు, ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడం నిషేధం. కానీ కొంత మంది వలంటీర్లు, పౌరసరఫరాల శాఖ డీలర్లు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదు. అధికార వైసీపీకి అంటకాగుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో వుందన్న విషయాన్ని పక్కన పెట్టి ప్రచార సభల్లో బహిరంగంగానే తిరుగుతున్నారు. కేసులు, సస్పెన్షన్‌లకు గురవుతున్నారు. ఇవి భవిష్యత్‌లో దీర్ఘకాలం పాటు వెంటాడతాయని అధికారులు చెబుతున్నారు. తీర్పు వచ్చే వరకు కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. యువకులైన వలంటీర్లు కేసుల్లో ఇరుక్కుంటే ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హులయ్యే ప్రమాదం ఉంది. కేసు కోర్టులో నడిచేంతవరకు ఉద్యోగానికి దూరం కావాల్సి వస్తుంది. ఇవేవీ పట్టించుకోని అధికార వైసీపీ అభ్యర్థులు గ్రామ వార్డు సచివాలయ వలంటీర్లతో పాటు డీలర్లను ఎన్నికల ప్రచారాల్లోకి తీసుకెళ్తున్నారు.

● ఐదేళ్లుగా సంక్షేమ పథకాల పేరుతో ఇంటింటికీ తిరిగిన వలంటీర్లు, ఎన్నో ఏళ్లగా రేషన్ లబ్ధిదారులతో పరిచయాలు వున్న డీలర్లకు నజరానాలు, రాజకీయంగా గుర్తింపు ఇస్తామన్న ఆశ చూపి ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందాలన్న వ్యూహంతో వైసీపీ ఉంది. నాయకుల వలలో చిక్కుకుంటే భవిష్యత్‌లో కేసులు, శిక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హత పొందక తప్పదని ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది.

ధిక్కరించే వారిని గమనిస్తున్నాం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. ధిక్కరించేవారిని గమనిస్తున్నాం. కేసులు నమోదు చేస్తాం. డీలర్లు, వలంటీర్లు రాజకీయ సభలు, ర్యాలీలు, ప్రచారాలకు దూరంగా ఉండాలి. వీటిల్లో పాల్గొనే వారిని ఉపేక్షించం.

- సాంబశివరావు, ఎంపీడీవో, ఎస్.కోట

డీలర్ సస్పెన్షన్

శృంగవరపుకోట, ఏప్రిల్ 1: ఎస్.కోట పట్టణంలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్థానిక చౌకధరల దుకాణం నెంబర్ 0230129 డీలర్ బుగత వెంకటేశ్వరరావు సోమవారం సస్పెండ్ అయినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గత నెల 21న జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నట్టు స్థానికులు ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిర్ధారించుకున్న అనంతరం ఎంపీడీవో సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీలర్‌పై చర్యల కోసం తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆర్డీవోకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆర్డీవో సస్పెండ్ చేశారు. రేషన్ దుకాణాన్ని డీలర్ కారాడ రాణికి అప్పగించినట్లు పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

బెల్ట్ షాపులకు సేల్

- ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి విక్రయం
- కీలక పాత్రధారులుగా సేల్స్‌మెన్
- ఇప్పటికే ఐదుగురు తొలగింపు
- అయినా మారని వారి తీరు

(విజయనగరం క్రైం)

జిల్లాలో బెల్టుషాపులకు మద్యం సరఫరా నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. అసలు బెల్ట్ షాపుల నిర్వహణే నిషేధం.. వాటికి అత్యధికంగా మద్యం సరఫరా చేయడం మరింత తప్పు. ఈ రెండింటికీ అడ్డుకట్ట పడడం లేదు. మద్యంషాపులో పనిచేసే సేల్స్‌మెన్‌ల సహకారం ఉండడమే ఈ పరిస్థితికి కారణం. అడ్డదారిలో డబ్బులకు ఆశపడి సేల్స్‌మెన్ మద్యాన్ని బెల్టుషాపులకు చేరవేస్తున్నారు. నిఘా కెమెరాలు వున్నా, వాటి కళ్లు కప్పి మద్యం సీసాలను బయటకు పంపించేస్తున్నారు. ప్రభుత్వ దుకాణాల్లో క్వార్టర్ బాటిళ్లు మూడు విధాలుగా ఉన్నాయి. ఎంఆర్‌పీ రేట్ల ప్రకారం 180 మిల్లీ లీటర్లు రూ.130, రూ.150, రూ.200, రూ.210, రూ.250 వరకూ వున్నాయి. సెల్స్‌మెన్‌కి ఒక బాటిల్ వద్ద రూ.20 చొప్పున ఇవ్వడంతో వారు గుట్టుగా బయటకు ఇచ్చేస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు సేల్స్‌మెన్‌కి ఇచ్చే రూ.20తో పాటు మరో రూ.30 అదనంగా వేసుకుని మద్యం అమ్ముతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో, టాస్కుఫోర్సు, స్థానిక పోలీసు స్టేషన్ల సిబ్బంది దాడుల్లో రోజూ వందల్లో 180 ఎంఎల్ బాటిళ్లు పట్టుబడుతున్నాయి. తాజాగా పూసపాటిరేగ మండలం చింతపల్లి గ్రామంలో 180 ఎంఎల్ బాటిళ్లు ఏకంగా 500 వరకూ పట్టుబడ్డాయి. గుర్ల మండలం పాలవలసలో 180 సీసాలు పట్టుబడ్డాయి. ఇలా నిత్యం జిల్లాలో ఎక్కడికక్కడ మద్యం బాటిల్స్ పట్టుబడుతున్నాయి. పట్టుబడిన బాటిళ్లు ఎక్కడి నుంచి వస్తున్నదీ ఆరా తీసి సంబంధిత ప్రభుత్వ వైన్‌షాపు వద్ద విచారణ నిర్వహించి బాధ్యులైన సేల్స్‌మెన్‌లను విధుల నుంచి తొలగిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రానున్న కాలంలో మరింత విస్తృతంగా పోలీసుశాఖ దాడులు చేయనుంది. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి, ఒకేసారి మూడు క్వార్టర్ బాటిళ్లకు మించి ఇవ్వకూడదు. అయితే ఎక్కువ సంఖ్యలో బాటిళ్లు సేల్స్‌మెన్‌ల ద్వారానే బయటకు వెళ్తున్నాయి.



మద్యం అక్రమంగా సరఫరా చేస్తే చర్యలు

జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. మద్యం బాటిళ్లు పట్టుబడితే, వాటిని సెబ్ విభాగం స్వాధీనం చేసుకుంటుంది.. రవాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. విచారణ నిర్వహించి ఎక్కడి నుంచి వచ్చాయో గుర్తించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు వ్యతిరేకంగా వెళ్లే సెల్స్‌మెన్, సూపర్‌వైజర్‌లను విధుల నుంచి తొలగిస్తాం.

- ఎన్‌వీ రమణ, డిపో మేనేజర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

అశోక్‌పై విమర్శలు తగవు

విజయనగరం రూరల్: నీతి, నిజాయితీ గల నాయకుడు అశోక్ గజపతిరాజుపై కొంతమంది చేస్తున్న చౌకబారు విమర్శలు, ప్రకటనలు మానుకోవాలని టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, పిల్లా విజయ్ కుమార్‌లు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దాదాపు 40 ఏళ్ల రాజకీయాల్లో ఉన్న అశోక్ మచ్చలేని మనిషిగా పేరు తెచ్చుకున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కర్రోతు నర్సింగరావు, కాళ్ల గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరికరాలు అందజేత

విజయనగరం రూరల్: విజయనగరం మండల పరిషత్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు ప్రభుత్వం తమకు ఇచ్చిన పరికరాలను సోమవారం ఎంపీడీవో గంటా వెంకటరావుకు అప్పగించారు. సెల్ ఫోన్, సిమ్ కార్డు, బయోమెట్రిక్ డివైస్ తదితర వాటిని అప్పగించారు. మండల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ నెల 3 లేదా 4వ తేదీ నుంచి చేపట్టనున్నారు. ఈ మేరకు కార్యదర్శులతో ఎంపీడీవో గంటా వెంకటరావు తన ఛాంబర్‌లో సాయంత్రం సమావేశం నిర్వహించారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: భోజరాజపురం మున్సిపల్ ప్రధాన వాటర్‌వర్క్స్‌లో ఇన్‌ఫిల్టరేషన్ బావులను శుభ్రపరిచే పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 3న (బుధవారం) పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

విజయనగరం రూరల్: మాజీ ఎమ్మెల్యే మీసాల గీత విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించారు. సోమవారం ఉదయం తన నివాసంలో అనుచరులతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కొండకరకాం గ్రామానికి వెళ్లి.. ప్రజలను కలిశారు. అనంతరం బాబామెట్ట, శాంతి నగర్, వీటీ అగ్రహారం, ప్రదీప్ నగర్‌లో పర్యటించారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయమే ధ్యేయం

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో బొబ్బిలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బేబీనాయన, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుల విజయమే ధ్యేయంగా జనసైనికులు కృషి చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు కనకల శ్యామ్, అల్లు రమేష్‌లు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల వారీగా టీడీపీ, బీజేపీతో కలిపి జన సైనికులు ప్రచారం చేస్తున్నారని... ముఖ్యంగా మహిళలు, యువతను ఆకర్షించే విధంగా తామంతా కృషి చేస్తున్నామని తెలిపారు.

నేడు గంజేసయ్యద్ బాబా చందనోత్సవం

విజయనగరం రూరల్: నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం రోడ్డులో ఉన్న గంజేసయ్యద్ బాబా చందనోత్సవం మంగళవారం జరగనుందని ముస్లిం సంఘ ప్రతినిధి మహ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్టు పేర్కొన్నారు.

4న జయహో బీసీ కార్యక్రమం

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామంలో ఈ నెల 4న జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు విజయనగరం పార్లమెంట్ బీసీ సాధికార కొప్పలవెలమ కన్వీనర్, కోడూరు తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లి అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుల సమక్షంలో జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

లెప్రసీ రోగులకు నిత్యావసర సరుకులు

విజయనగరం రింగురోడ్డు: డాక్టర్ పీవీజీ రాజు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో పూల్‌బాగ్‌లోని లెప్రసీ కాలనీలో లెప్రసీ వ్యాధిగ్రస్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎస్ఎన్ రాజు, పి.సీతారామరాజులు బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, సబ్బులు, మిరపకాయలు, కొబ్బరి నూనెతో తదితర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్టు ప్రతినిధి డాక్టర్ తాలాడ దీప్తి, రామచంద్రరాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన విద్యార్థి

రాజాం: రాజాం విద్యార్థి పవర్ లిఫ్టింగ్‌లో పోటీలో సత్తా చాటాడు. ఎన్టీఆర్ జిల్లా చిలకల్లులో గతనెల 30, 31 తేదీల్లో 67వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఇంటర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈసందర్భంగా రాజాం జీసీ ఎస్ఆర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి జి.అభి రామ్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నాడు. అండ ర్-17 విభాగంలో (63-67) కేజీల ప్రథమ స్థానంలో నిలిచా డు. అభిరామ్‌ను క్రీడల విభాగాధిపతి చీకటి కేశవ నారాయణరావు అభినందించారు. అభిరామ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తంరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్ర, విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు

రెండుపూటలు చేస్తేనే వేతనం గిట్టుబాటు

రేగిడి: మారిన జీవో ప్రాప్తికి ఇకపై ఉపాధి కూలీలు కొలతల ప్రాప్తికి రెండుపూటలూ పనిచేస్తే రూ.300 వేతనం గిట్టుబాటు ఉంటుందని ఉపాధి ఏపీవో ఎస్.హరనాథ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఖండ్యాం పంచాయతీలో గల చిన్నగెడ్డలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీచేశారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది రమణ, మేట్లు ఉన్నారు.

పేద విద్యార్థినికి సాయం

లక్కవరపుకోట (కొత్తవలస): ఒక పేదింటి విద్యార్థిని చదువు కోసం సాహసం స్వచ్ఛంద సంస్థ అధినేత మాచవరపు గణేష్ ముందుకొచ్చారు. సోమవారం సెయింట్ జార్జి విద్యాసంస్థలో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న కొయ్యాన ఉషకు రూ.30వేల ఆర్థిక సాయం అందించారు.

గిరిజన గ్రామాల సమస్యలు తెలుసుకోండి

బొబ్బిలి: ఎన్నికల సమయంలోనైనా బొబ్బిలి మండలానికి చెందిన గిరిజన గ్రామాలలో రాజకీయ నాయకులు పర్యటించి అమాయక గిరిజనులకు భరోసా కల్పించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలంలోని గిరిజన గ్రామాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పట్టణానికి సుమారు 10-15 కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్న సియోనువలస, అక్కేనవలస, బట్టివలస, మూలవలస, కొత్తూరు, కేశాయవలస, డొంగురువలస, ఎరకందొరవలస, మోపూరువలస, దేవుని బొడ్డవలస గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేదన్నారు. అక్కడి సమస్యలను నాయకులు స్వయంగా పరిశీలించి...పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



తారురోడ్డు కోసం మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్న డొంగురువలస రహదారి ఇలా...

ఆక్రమణలు తొలగించండి



సమస్య పరిష్కరించాలని కోరుతున్న తిమిడి గ్రామస్థులు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని తిమిడి రామాలయం ఇరు వైపుల నుంచి శ్మశాన వాటిక వరకూ ఉన్న సుమారు 4ఎకరాల ప్రభుత్వ భూమి కొంతమంది పెద్దలు ఆక్రమించుకున్నారని, వాటిని తొలగించాలని సాక్ష్యత్తు కలెక్టర్ స్పందనలో కోరినా చర్యలు లేవని గ్రా మస్థులు తెలిపారు. సోమవారం గ్రామస్థులు సత్తి బా బు, వెంకటరావు, సత్య నారాయణ తదితరులు మాట్లాడుతూ ఈ ఆక్రమణల విషయంపై జిల్లా కలె క్టర్‌కు స్పందనలో ఫిర్యాదుచేస్తే వెంటనే తొలగిస్తా మన్న అధికారులు ఇప్పు డు తమ వల్లకాదని చేతులు ఎత్తేశారని వాపోయా రు. ఇప్పటికైనా ఆక్రమ ణలు తొలగించి తమ సమస్య తీర్చాలని కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో మేలు



తలారి గ్రామంలో ప్రచారం చేస్తున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని టీడీపీ అభ్యర్థి లలితకుమారి అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆమె జోరుగా ప్రచారం చేస్తున్నారు. నేతలను, కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ప్రచారం ముమ్మరం చేశారు. వీరభద్రపేట, తలారి, ఖాసాపేట గ్రామాల్లో సోమవారం ప్రచారంలో పాల్గొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వీరభద్రపేటలో మల్లునాయుడు, కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, జక్కాన కన్నబాబు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రాంప్రసాద్, మల్లా రామకృష్ణ, రమేష్ నాయుడు, ఆదినారాయణ, వీరమహిళ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో టీడీపీ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న కళా వెంకటరావు

రాజాం: చీపురుపల్లిలో టీడీపీ జెండా ఎగరాలని, 40 రోజులు కష్టపడి పని చేయాలని ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కిమిడి కళావెంకటరావు తెలిపారు. సోమవారం రాజాం క్యాంపు కార్యాలయంలో చీపురుపల్లి నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శత్రువును తక్కువ అంచనా వేయవద్దన్నారు. మన అందరి ఏకైక లక్ష్యం గెలుపే కావాలని, ఆ దిశగా కార్యకర్తలు పనిచే యాలన్నారు. సమన్వయంతో అందరు ముందుకు వెళ్లాలన్నారు. ఎన్నికల జరగడానికి 40 రోజులే గడువు ఉందని, నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తాను చీపురుపల్లిలోనే నివాసం ఉంటానని చెప్పారు. కార్యాలయంలో నిత్యం కార్యకర్తలు అందుబాటులో ఉంటానన్నారు. అంతే కాకుండా తన కుమారుడు రామ్‌మల్లిక్ నాయుడు కూడా అందుబాటులో ఉండి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రౌతు రమేష్‌నాయుడు గోవిందరావు, శ్రీరాములునాయుడు, వెంకటరమణమూర్తి, జగసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా కళా వెంకటరావును ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు కలిశారు. అక్కడి బీజేపీ అభ్యర్థి విజయానికి సహకరించాలని ఆయన కోరారు.

ఆంజనేయ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

వంగర: పటువర్ధనంలో గ్రామస్థులు నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠామ హోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద ఎండితులు శ్రీనివాస శర్మ ద్వర్యంలో ప్రతేక పూజలు చేశారు. ఆంజనేయ విగ్రహం ఊరేగింపు, హోమాలు, అన్న సమారాధనలు నిర్వహించారు.

పైడిమాంబ ఆలయంలో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ వనంగుడిలో సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా చండీయాగం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ ఈ యాగం జరిగింది. వివిధ ప్రాంతాల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చండీయాగం నేపథ్యంలో పైడిమాంబను వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. పాల్గొన్న భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందజేశారు.

గ్రామ పరిధిలోని క్వారీలు నిలుపుచేయాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 1: గ్రామ సమీపంలో ఉన్న రాయి క్వారీల వల్ల స్థానిక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదని భోగాపురం మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన పలువురు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి అనితకు ఫిర్యాదు చేశారు. కొంగవానిపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ రాయి క్వారీలు తమ గ్రామానికి అనుకుని ఉన్నాయి. దీనివల్ల నిత్యం రాయి పేల్చడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐదు క్వారీలు నిర్వహిస్తు న్నారని, తక్కువ విస్తీర్ణంలో అనుమతి తీసుకుని ఎక్కువ విస్తీర్ణంలో రాయి తీస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్వారీ కోసం బాంబులు బ్లాస్టింగ్ చేయడం వల్ల ఇళ్లు దెబ్బ తింటున్నాయన్నారు. కొన్ని క్వారీలు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నా రన్నారు. గ్రామంలో మొదటి ప్రజా అభిప్రాయం సేకరించిన సమయంలో తాము అభ్యంతరం వ్యక్తం చేశామని, రాయి క్వారీలు నిర్వహించే సమీపంలో పాఠశాల కూడా ఉందని, దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి క్వారీలను నిలిపివేసి ప్రజలు ఆరోగ్యం కాపాడాలని గ్రామానికి చెందిన రమణ బంగారయ్య, రమణయ్య, నర్సయ్య తదితరులు కోరారు.

టీడీపీ గెలుపు చారిత్రక అవసరం



ప్రచారంలో బేబీనాయనపై పూలు జల్లుతున్న మహిళ

బొబ్బిలి: తెలుగుదేశం-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్ కేకే రంగారావు (బేబీనాయన) సోమవారం స్థానిక 14వ వార్డుకు చెందిన అప్పయ్యపేట, సింగారపు వీధి తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దారి పొడవునా గ్రామస్తులు బేబీనాయనకు సాదర స్వాగతం పలికారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 30 ఏళ్ల వెనక్కి వెళ్లామని బేబీనాయన అన్నారు. జగన్ అసమర్థ పాలన కారణంగా రైతులతో పాటు కూలీలు, చేతివృత్తుల వారు, ఉద్యోగ, వ్యాపార, కార్మిక వర్గాల వారంతా అవస్థలు పడుతున్నార న్నారు. ఎన్‌డీఏ కూటమి గెలుపు చారిత్రక అవసరమని బేబీనాయన అన్నారు. ఆయన వెంట జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు రాంబార్కి శరత్‌బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ, అల్లాడ భాస్కరరావు, రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, తెలుగు మహిళ నాయకురాళ్లు వెలగాడ హైమావతీవాసు, కింతలి శ్రీదేవీ బంగార్రాజు, కళ్యంపూడి లక్ష్మీసత్యనారాయణ, బీసపు పార్వతి, కనక మహేశ్ పట్నాయక్ పాల్గొన్నారు.

కోండ్రుతోనే అభివృద్ధి సాధ్యం

రాజాం రూరల్: రాజాం నియోజకవర్గ అభివృద్ధి కోండ్రు మురళీమోహన్‌తోనే సాధ్యమని విజయనగరం లోక్‌సభ నియోజకవర్గ అధికార ప్రతినిధి వంగా వెంకటరావు తెలిపారు. మండలంలోని పెనుబాక తదితర గ్రామాలలో సోమవారం రాత్రి టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల గురిం చి ప్రజలకు వివరించారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓటేసి కోండ్రు మురళిని గెలి పించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చీడి జగన్నాథం, కుమార్, రాంబాబు, నాగభూషణం, గోపి పాల్గొన్నారు.

జగన్ వల్లే పింఛన్ల పంపిణీలో జాప్యం

రాజాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వార్థ రాజకీయాలు వల్ల ఈనెల పింఛన్ల పంపిణీలో జాప్యం నెలకొందని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్య దర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు కొరతే కారణం తప్ప ఎన్నికల కమిషన్, టీడీపీ కాదని తెలిపారు. ఈనెల ఒకటో తేదీన ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం జగన్ ఎందుకు ఆదేశా లు జారీచేయలేదని ప్రశ్నించారు. సీఎం స్వార్థరాజకీ యాలతో పింఛన్‌దారులు, వలంటీర్లు నష్టపో తున్నారని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ .నాలుగు వేలు పింఛన్ అందజేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీ విషయంలో తీవ్ర జాప్యం చేసి, టీడీపీ అడ్డుకుంటుందని బురదజల్లడం తగదని హితవు పలికారు.

టీడీపీ అధికారంలోకి వస్తే షుగర్స్ తెరిపిస్తాం

జామి: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే భీమసింగి షుగర్స్‌ను తెరిపించి.. పూర్వ వైభవం తెస్తామని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం భీమసింగిలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూతపడడంతో వందలాది మంది కార్మికులకు పనులు లేక వలసలు వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది రైతులు చెరుకు పంట మానేసి తమ పొలాలను వృథాగా వదిలేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ పన్నాగంతోనే షుగర్స్ మూత పడిందన్నారు. తాము షుగర్స్‌తో పాటు శాసనపల్లి వంతెననూ నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు కొత్తలి సూర్యారావు, స్వామి నాయుడు, పైడిరాజు, బండారు జగన్నాథం, శ్రీనివాసు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అనంతరం కూటమి అభ్యర్థి శ్రీనివాస్‌ను ఐదు మండలాల కార్యకర్తలు, నాయకులు ఘనంగా సత్కరించారు.

కాలువలను శుభ్రం చేయండి



కొత్త ఎరుకలివీధిలో కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని అన్ని ప్రాంతా లలో గల కాలువలను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆమె మహారాణిపేట, కొత్త ఎరుకలివీధి, సింగారపు వీధులలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పలుచోట్ల కాలువలను శుభ్రం చేయడం లేదని, చెత్త పేరుకుపోతోందని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. కమిషనర్ వెంట పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మడ్డువలస రిజర్వాయర్‌లో మత్స్యకారుడి మృతి

వంగర: వంగర మండలంలోని మడ్డువలస రిజ ర్వాయర్‌కు వేటకు వెళ్లిన అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన మత్స్యకారుడు కొమ్మర దేవుడు (47) పటువర్ధనం సమీపంలో నాటుపడవ బోల్తాపడి మృతిచెందాడు. పటు వర్ధనం గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. రిజర్వాయర్‌లోకి నాటుపడవతో సోమవారం సాయంత్రం దేవుడు వెళ్లాడు. నదిలోకి వెళ్లిన కొద్దిసేపటికే నాటుపడవ గాలులకు బోల్తాపడింది. దీంతో చేపలకు వేయడానికి సిద్ధంచేసిన వలకు చిక్కుకుని మృతిచెందాడు. వేటకు వెళ్లిన దేవుడు చీకటిపడిన వరకు రాకపోవడంతో కంగారు పడిన భార్య సూకమ్మ గ్రామంలో తోటి మత్స్యకారులకు విషయం తెలియజేసింది. దీంతో నది వద్దకు వెళ్లిన మత్స్యకారులు బోల్తాపడిన బోటు, వలకు చిక్కుకుని ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. అయితే అప్పటికే మృతిచెం దినట్టు గుర్తించారు. దేవుడు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి నుంచి పొట్టపోషణకు పటువర్ధనం వచ్చాడు. ఇక్కడ మడ్డువలస రిజర్వాయర్‌లో చేపల వేట సాగించి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దేవుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిప ర్యాంతమయ్యారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దేవుడు మృతి విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజాం తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

చెరువులో యువకుడి గల్లంతు



చెరువులో గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యం

పాలకొండ: చెరువులో పడి యువ కుడు గల్లంతైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని మేదరవీధికి చెందిన మింది ప్రభాష్ స్థానిక వెంకటరాయుని కోనేరులో సోమవారం మధ్యాహ్నం స్నానానికి దిగి గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న తండ్రి లక్ష్మణరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడి ఆచూకీ కోసం అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. పార్వతీపురం నుంచి నలుగురు అగ్నిమాపక సిబ్బంది, ముగ్గురు గజఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభాష్ ఆచూకీ రాత్రి 9గంటల వరకు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు చెరువు గట్టు వద్ద పడిగాపులు కాస్తున్నారు.

మద్యం సీసాలు సీజ్

రేగిడి: మండలంలోని కాగితాపల్లి సెంటర్ వద్ద తెర్లాం మం డలంలోని ఉద్దవోలుకు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద 70 మద్యం సీసాలు స్వాధీనంచేసుకుని సీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీని వాస్ తెలిపారు. బెల్ట్‌షాపులకు తరలిస్తున్న మద్యాన్ని ఎన్నికల తనిఖీల్లో రెడ్‌హేండెడ్‌గా పట్టుకుని కేసు నమోదుచేసినట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులను అరెస్టుచేసినట్లు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

బొబ్బిలి: కొయకొండవలస గ్రామంలో 3,200 లీటర్ల బెల్లం ఊటను సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధర్ తెలిపారు. తమ సిబ్బందితో పాటు ఇంటెలిజెన్స్ టీముతో కలిసి దాడులు నిర్వహించామని చెప్పారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్థులను హెచ్చరించామన్నారు. అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో తమ వెంట సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, విజయనగరం డీటీఎఫ్ సిబ్బంది, ఇంటెలిజెన్స్ బృందం పాల్గొనట్లు సీఐ తెలిపారు.

గ్రామీణ బ్యాంకుల ఆరాధ్య దైవం దాదా



దిలీప్‌కుమార్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం రింగురోడ్డు: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆరాధ్యదైవం దిలీప్ కుమార్ ముఖర్జీ(దాదా) అని బ్యాంకు ఉద్యోగ అధికార సంఘాల ప్రాంతీయ కార్యదర్శులు అంబటి దుర్గ, వెంకటేష్‌లు కీర్తించారు. సోమవారం దిలీప్ కుమార్ ముఖర్జీ 11వ వర్ధంతిని ప్రేమ సమాజంలోని వృద్ధుల మధ్య నిర్వహించి... వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘ సమస్యల పరిష్కారంలో దాదా కీలక పాత్ర వహించారన్నారు. ఆయన మార్గంలోనే నేటి సంఘ ప్రతినిధులు నడుచుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పణి కుమార్, మధుసూధనరావు, రీజనల్ మేనేజర్ డీఆర్‌కే రాజు, అడ్మిన్ సునీల్‌వర్మతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

రామభద్రపురం: ఆరికతోట గ్రామంలో సోమవారం భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర ఆలయ 15వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. బా దంపూడి నాగరామ లింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం చేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అచ్చెన్నకు కోండ్రు పరామర్శ

రాజాం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నా యుడు తల్లి కళావతమ్మ ఆదివారం నిమ్మాడలో అనారో గ్యంతో మృతి చెందడంతో రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ సోమవారం సంతాపం తెలిపారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడును పరా మర్శించారు. ఆయన వెంట టీడీపీ రాజాం మండలాధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, టంకాల నాగరాజు పాల్గొన్నారు. అనంతరం రాజాం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చిం చారు. కష్టపడి పనిచేసి గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని అచ్చెన్నాయుడు సూచించారు. ● రేగిడి: కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడును సంకిలికి చెందిన అడ్వకేట్ సీపీనాయుడు, పార్టీ నేతలు కర్రి రమణ, గంగు కృష్ణారావు, బింగి శ్రీరామమూర్తి, కర్రి రాము లు, బాన్న పోలస్, గుండ జగన్నాథం, భైరి దుర్గారావు, పెంకి జగ్గన్న, జి.అప్పలనాయుడు తదితరులు పరామర్శించారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రంగాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి.. బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం'

విజయనగరం రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరుతూ టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు చేపట్టిన 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం' కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం పొత్తూరువారి వీధి, చిన్న పల్లి వీధి తదితర ప్రాంతాల్లో బ్రాహ్మణ నాయకులు పర్యటించారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలను వివరించారు. టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు పేరి రామయ్య పంతులు, ద్వాదశి వేణు, వడ్లమాని శేఖర్, సన్యాసిరావు, జంధ్యాల బుచ్చిబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు అధిష్ఠానం వద్దకు నాగార్జున

విజయగనరం: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మంగళవారం చంద్రబాబు, లోకేష్‌ను కలవనున్నారు. చీపురుపల్లి నియోజకవర్గ టిక్కెట్టు తనకు కేటాయించకపోవటంతో అసంతృప్తితో ఉన్నారు. కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో తన రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తానని వెల్లడించారు. ఈ పరిస్థితిలో చంద్రబాబు విజయవాడ రావాలని కబురు పెట్టారు. మంగళవారం చర్చలు జరపనున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రాజాం రూరల్: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠినచర్యలు తప్పవని చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి హెచ్చరిం చారు. ప్రశాంత ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన అన్నివర్గాల ప్రజలకు కోరారు. సోమవారం పారా మిలటరీ సిబ్బందితో పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకదృష్టికి కేంద్రీకరించామన్నారు. ఆయా గ్రామాల్లో పారామిలటరీ సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. సమస్య జటిలం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలి పారు. వివాదాలకు కారకులైన వారిని ముందస్తుగా గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఏయే గ్రామాల్లో వివాదాలు తలె త్తాయో గుర్తించి భారీగా బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధ నలకు లోబడి తమవెంట నగదు, బంగారం తీసుకెళ్లిన వారు అందుకు తగిన రుజువులు చూపాల్సి ఉంటుంద ని తెలిపారు. కవాతులో ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రాజాం టౌన్, రూరల్ సీఐలు మోహనరావు, శ్రీనివాస్, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

జామి: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఐ ఉపేంద్ర, ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



రాజాం: కవాతు నిర్వహిస్తున్న పారామిలటరీ బృందం



జామి: అన్నంరాజుపేటలో పోలీస్‌కవాతు

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే..

● పేరిపి సమీపంలో ప్రధాన రహదారికి కోత ● డమ్మీగా మారిన అక్విడెక్టు
● వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం ● ఆధారం లేకుండా ఉన్న సుజలధార పైపులైన్లు ● పట్టించుకోని అధికారులు

చీపురుపల్లి: మండలంలోని పేరిపి గ్రామ సమీపంలో ప్రధాన రహదారి కోతకు గురయ్యింది. దీంతో తోటపల్లి రణస్థలం బ్రాంచి కెనాల్ మీద నిర్మించిన అక్విడెక్ట్ ఇప్పటికే డమ్మీగా మారిపోగా, దీనికి ఆనుకొని ఉన్న బ్రిడ్జికి కూడా ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే రోడ్డులో చాలా భాగం కరిగి కాలువలో కలిసిపోయింది. మరింత నిర్లక్ష్యం చేస్తే బ్రిడ్జికి కూడా ప్రమాదం తప్పదని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చీపురుపల్లి మండలంలోని అలజంగి నుంచి పేరిపి వెళ్లే దారిలో తోటపల్లి కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా రణస్థలం బ్రాంచి కెనాల్ ఉంది. ఆ బ్రాంచి కెనాల్ మీదుగా పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీని కోసం అలజంగి, పేరిపి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మించారు. అయితే, గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా కోతకు గురయ్యింది. దీని కారణంగా అలజంగి, పేరిపి గ్రామాల మధ్య రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగనప్పటికీ, బ్రిడ్జికి ఆనుకొని నిర్మించిన అక్విడెక్ట్ పూర్తిగా డమ్మీగా మారింది. పేరిపి వైపు పలు గ్రామాలకు తాగు నీరందించే సుజలధార పైపు లైన్లు ఆధారం లేకుండా వేలాడుతూ ఉన్నాయి. వీటితో పాటు ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జికి కూడా పాక్షికంగా నష్టం వాటిల్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక్కడున్న పరిస్థితుల్ని సంబంధిత అధికారులు పరిశీలించి, సత్వరమే అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారి కోతకు గురి కావడంతో ఆధారం లేకుండా వేలుడుతున్న పైపులైన్లు

తక్షణమే బిల్లులు చెల్లించండి

● గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పల్ల సురేష్

గుమ్మలక్ష్మీపురం: వార్డెన్లకు తక్షణమే బిల్లులు చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పల్ల సురేష్ ఒక ప్రకటనలో సోమవారం కోరారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు, భోజనం అందజేస్తున్నా, ఏడు నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. వార్డెన్లకు బిల్లులు చెల్లించకపోతే ఎలా భోజనం అందజేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వారు అప్పులు చేసి పెడుతు న్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బిల్లులు సకాలంలో చెల్లించాలని, పౌష్టికాహారం లోపించి విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశముందని పేర్కొన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి బిల్లులు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పన్ను వసూళ్లలో పాలకొండకు తృతీయ స్థానం



అడ్మిన్ సెక్రటరీలు, సిబ్బందికి అభినందిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, నగర పంచాయతీ సిబ్బందితో సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ కోరాడ సర్వేశ్వరరావు మెమెంటోలతో సత్కరించారు. ముున్ముందు ఇదే పనితీరు కనబరచాలని కమిషనర్ సర్వేశ్వరరావు ఆకాంక్షించారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



గిజబలో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: గిజబలో నూతనంగా నిర్మించిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ విగ్రహప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 3వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. సోమవారం అఖండ దీపారాధన, గ్రామ ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 3న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ శిఖర, యంత్ర, ధ్వజ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించను న్నారు. ఉత్సవాల్లో భాగంగా కోలాటం ప్రదర్శించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని దుర్గాదేవి వీధిలో గల శ్రీ విద్యా సర్వమం గళాదేవి పీఠం ప్రాంగణంలోని శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం మురపాక కాళిదాసు శర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఉత్సవ ఉగ్రహాలు ఊరేగించారు. దుర్గాదేవి ఆలయ ప్రాంగణం నుంచి ఉత్సవ విగ్ర హాల ఊరేగింపు మేళతాళాల మధ్య సాగింది.



వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రాక్షసపాలనకు చరమగీతం పాడుదాం

● కూటమి అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడుదా మని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత అన్నారు. సోమవారం సీతానగరం నుం చి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాల యం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మా ట్లాడారు. త్రివేణి సంగమంలా ఏర్పడిన పవిత్రమైన ఎన్డీఏ కూటమితో నియంత పాలనకు చెక్ చెబుతామన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయానికి వెళ్లి తనతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్రను రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, నాయకులు జీవీ నాయుడు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

కొమరాడ: రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు గెలవాలని కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. కళ్లికోట గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ ఎస్.ఉదయశేఖరపాత్రుడు అధ్యక్షతన సోమవారం నిర్వ హించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శనరావు, పి.వెంకటనాయుడు, మధుసూదనరావు, డి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **కురుపాంరూరల్:** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి తోయిక జగదీశ్వరి సోమవారం ఏజన్సీ గ్రామాల్లో ప్రచారం చేశారు. గుమ్మిడిగూడ పంచాయతీ పరిధిలో గుమ్మిడిగూడ, దండుసూర, సేకుపాడు గ్రామాల్లోనూ, బియ్యాలవలస పంచాయతీ పరిధిలోగల దురుబిలి, సూర్యానగరం గ్రామాల్లో ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. టీడీపీ మండల కన్వీనరు కలిశెట్టి కొండయ్య, పార్టీ నాయకులు కోలా రంజిత్‌కుమార్, డా.శెట్టి చంద్రరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దండుసూర గ్రామానికి చెందిన 60 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

● **గుమ్మలక్ష్మీపురం:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోడ్‌కు ముందు 15 రోజుల్లో పలు అక్రమాలకు పాల్పడిందని కురుపాం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి ఆరోపించారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన సొంత కాంట్రాక్టర్లకు 13 వేల కోట్లు ధారాదత్తం చేశారని ఆరోపించారు. పింఛన్లు పంపిణీకి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నెలకు రూ. నాలుగు వేలు చొప్పున ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

లోకేశ్‌ను కలిసిన బంగార్రాజు

నెల్లిమర్ల: ఎమ్మెల్యే టికెట్ ఆశించి నిరాశకు గురైన కర్రోతు బంగార్రాజును టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ బుజ్జగించారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తా నని హామీ ఇచ్చారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ఇటీవల బంగార్రాజు నిర్ణయించిన నేపథ్యంలో ఆయన్ని లోకేశ్ విజయవాడ పిలిపించారు. సోమవారం తనను కలిసిన బంగార్రాజుతో లోకేశ్.. తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని భరోసా ఇచ్చారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసే నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని కోరారు. దీనిపై బంగార్రాజు స్పందిస్తూ రెండు రోజుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. లోకేశ్‌ను కలిసిన వారిలో టీడీపీ భోగాపురం, నెల్లిమర్ల మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పూసపాటిరేగ మాజీ జడ్పీటీసీ ఆకిరి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, నాయకులు దంగా భూలోక, ఇజ్జురోతు ఈశ్వరరావు, పిల్లా లక్ష్మీనారాయణ, జనపాల రవి, పృథ్వీ ఉన్నారు.



లోకేశ్‌తో బంగార్రాజు తదితరులు

కూటమితోనే సంక్షేమ పాలన

నెల్లిమర్ల: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. జరజాపుపేటకు చెందిన వైసీపీ నాయకులు ఎంఎం నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, వారి అనుచరులు ఆదివారం రాత్రి జనసేన పార్టీలో చేరారు. వారిని ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమెను సత్కరించారు. టీడీపీ నాయకుడు అవనాపు విజయ్, జనసేన నాయకుడు రవ్వా నాని, పార్టీ నాయకులు అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, ఎం.భరత్‌కుమార్, పి.రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాధవిని సత్కరిస్తున్న దృశ్యం

చంద్రబాబును కలిసిన చంద్రశేఖరరావు

డెంకాడ: టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు సోమవారం బాపట్ల పట్టణంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన నాయకులకు తోడ్పాటు కల్పించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

చీపురుపల్లి: సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాలు తమ సహకారం అందించాలని ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు కోరారు. ఎమండలంలోని పెదనడిపల్లి, గచ్చులవలస గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన ప్రజలతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా మెలగాలన్నారు. ఎన్నికల ఘర్షణల్లో కేసులు నమోదైతే పర్యావసానాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో వడదెబ్బకు గురికాకుండా ఉండేలా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం ఎండల తీవ్రంగా ఉండడంతో డీహైడ్రేషన్ తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బయటకు వెళ్లేవారు తెలుపు, లేత రంగుల కాటన్ వస్త్రాలు ధరించాలని సూచించారు. నీళ్లు, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మధ్యాహ్నం పూట బయటకు వెళ్లొద్దని ఆయన సూచించారు.

ఆయుర్వేదంతో మంచి ఉపశమనం

సీతానగరం: వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా ఆయుర్వేదంతో మంచి ఉపశమనం కలుగుతుందని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి టి.హేమాక్షి అన్నారు. ఈసందర్భంగా ఆమె ఆసుపత్రిలో సోమవారం మాట్లాడారు. సబ్జా గింజలు నానబెట్టి, నిమ్మరసం కలిపి అందులో కొంచెం కండ చక్కెర వేసి తాగాలన్నారు. మజ్జిగలో జీలకర్ర పొడి చిటికెడు, కొంచెం బ్లాక్ సాల్ట్ కలిపి తీసుకోవచ్చని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సూచనలు పాటిస్తూ ఉండాలని ఆమె కోరారు.

అధికారుల సమక్షంలో ఆశీల వసూలు

గజపతినగరం: గజపతి నగరం, పురిటిపెంట పంచాయ తీలకు సంబంధించి రోజువారి మార్కెట్ ఆశీలను సోమవారం ఆయా పంచాయతీ అధికారులే వసూలు చేశారు. మార్చి నెలాఖరు నాటికి ఆశీలుపాట గడువు ముగియడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో 2024-25కి సంబంధించి వేలంపాట నిర్వహణ నిలిచిపోయింది. దీంతో గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల అధికారులు రోజువారి వేలంపాట ఆశీలును వసూలు చేశారు. వీటిని గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తామని గజపతినగరం ఈవో రమణ తెలిపారు. మూడు నెలలు పాటు అధికారులే వసూలు చేస్తారని, ఆ తర్వాత జిల్లా అధికారుల సూచనల మేరకు ఆశీలు వేలంపాట నిర్వహిస్తామని చెప్పారు. పాటదారులకు గడువు ముగిసినప్పటికీ ఆశీల వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆశీలు వసూలు చేస్తున్న ఈవో రమణ

ఈసీ ఆదేశాలు తప్పుదోవ పట్టించడం తగదు

గజపతినగరం: కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎన్నికల కమిషన్ వలంటీర్ల వ్యవస్థను దూరం పెట్టాలని ఇచ్చిన ఆదేశాలను వైసీపీ ప్రభుత్వం తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారం చేయడం తగదని ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ బాధ్యతలు అప్పగించడం తగదన్నారు. 3వ తేదీ నుంచి సచివాలయ అధికారులతో పింఛన్లు అందజేయాలని డిమాండ్ చేశారు.

జగన్ అసమర్థతతో రాష్ట్రం సర్వనాశనం

గంట్యాడ: జగన్ అసమర్థతతో రాష్ట్రం సర్వ నాశనం అయ్యిందని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం గంట్యాడ గ్రామంలో క్లస్టర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మాజీ సర్పంచ్‌లు, క్లస్టరు ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణలను నిరోధించాలి

నెల్లిమర్ల: నెల్లిమర్ల మెయిన్ రోడ్డు పక్కన వాసవీ కన్యకాపరమేశ్వరి, శ్రీకృష్ణ దేవాలయాల నిర్మాణానికి నగర పంచాయతీ కౌన్సిల్ తీర్మానం చేసిందని... ఆ స్థలంలో శ్రీకృష్ణ దేవాలయానికి స్థలం ఉంచకుండా కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని నిర్మిస్తున్నారని యాదవ సంఘ ప్రతినిధి, మాజీ ఎంపీటీసీ నక్కాన వెంకటరావు తెలిపారు. ఈ అక్ర మ నిర్మాణాన్ని ఆపాలని, తమ ఆలయ నిర్మాణానికి స్థలం చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్‌కు, ఎస్ఐకి సోమవారం వినతిపత్రం సమర్పించినట్లు వెంకటరావు తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరావు

కూటమి గెలుపునకు కృషి చేస్తాం

గరివిడి: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావును రాజాంలోని ఆయన స్వగృహంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కలిసారు. కూటమి గెలుపునకు పూర్తిగా కృషి చేస్తామని తెలిపారు. కళాను కలిసిన వారిలో రెడ్డి గోవింద, వెంపడాపు రమణమూర్తి, లక్ష్మంనాయుడు, సాయిరాజు, అడపా సూర్యనారాయణ, వల్లిరెడ్డి శ్రీరాములు, సత్యనారాయణ ఉన్నారు.

కోటమ్మతల్లి తొలేళ్ల ఉత్సవం

శృంగవరపుకోట రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొట్టాం కొటమ్మతల్లి జాతర సోమవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా అమ్మవారికి గద్దె గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వందలాది మంది భక్తులు... పూజారులను ఏలి ఏనుగు (చెక్కతో చేసిన ఏనుగు)పై ఉరేగించారు. మంగళవారం పాలధార ఉత్సవం ఉంటుందని ఈవో నాగేంద్ర తెలిపారు.



అమ్మవారి పూజారులను ఏలి ఏనుగుపై ఊరేగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా..

ఏపీపీఎస్సీ కుంభకోణంపై కేసు నమోదు చేయాలి

కురుపాం: ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలకు, అధికార దుర్వినియో గానికి పాల్పడిన సీఎం జగన్మోహన్ రెడ్డి, ఛైర్మన్ గౌతం సవాంగ్ పై చర్యలు చేపట్టాల ని టీడీపీ నాయకులు కోరారు. ఈమేరకు కురుపాం తెలుగు యువత అధికార ప్రతిని ధి కోలా రంజిత్‌కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్రపండా, మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, టీడీపీ నాయకులు సోమవారం కురుపాం పోలీసు లకు ఫిర్యాదు చేశారు.

11 కేజీల గంజాయి స్వాధీనం

● ఇద్దరు కేరళ వాసులపై కేసు నమోదు

భామిని: ఒడిశా నుంచి 11 కేజీల గంజాయిని ప్రైవేటు బస్సులో తరలిస్తుండగా బత్తిలి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరి కేరళా వాసులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు బత్తిలి ఎస్ఐ సీహెచ్. ప్రసాద్ తెలిపారు. దీని విలువ రూ.55 వేలు ఉంటుందని చెప్పారు. ఇటీవల మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని, ఒడిశాకు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. అయితే గంజాయి ఒడిశా నుంచి విశాఖ రైలు మార్గంలో వెళ్తున్నట్లు సమాచారం ఉందన్నారు.

160 లీటర్ల సారా..

సీతంపేట: సీతంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేగులగూడ గ్రామ పొలిమేరల్లో అక్రమంగా తరలిస్తున్న 160 లీటర్ల సారాస్వాధీనం చేసుకన్నట్లు ఎస్ఐ ఎం.జగదీశ్‌నాయుడు సోమవారం తెలిపారు. సారా తరలిస్తున్న వ్యక్తి తమను చూసి పారిపోయాడని చెప్పారు. ఈ మేరకు ముద్దాయి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

వృథాగా సర్వే రాళ్లు



చంద్రంపేట వద్ద వృథాగా పడి ఉన్న సర్వే రాళ్లు

సాలూరు రూరల్: సర్వే రాళ్లు ఇలా వృథాగా పడిఉన్నాయి. భూహక్కు పేరిట ప్రభుత్వం సర్వే పనులు చేసిన విషయం విదితమే. ఈ సర్వే పనులు సమగ్రంగా ఇప్పటివరకు జరపలేదు. దీంతో సర్వే రాళ్లు నియోజకవర్గ పరిధిలో ఎక్కడికక్కడే ఇలా వృథాగా పడిఉన్నాయి. మరో వైపు ఎన్నికల కోడ్ రావడంతో ఈ రాళ్ల సంగతి అంతేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కార్యాలయాలకు చేరుకున్న వలంటీర్ల సామగ్రి

గరుగుబిల్లి: గ్రామ వలంటీర్ల నుంచి సామగ్రిని కార్యదర్శులు స్వాధీనం చేసుకుని మండల పరిషత్ కార్యాలయాలకు అప్పగిస్తున్నారు. సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు గతంలో అందించిన సెల్‌ఫోన్లు, సిమ్‌లతో పాటు డివైజ్‌లు, తదితర సామగ్రిని సోమవారం అప్పగించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి ఆదేశాల మేరకు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎంపీడీవో పైల సూర్యనారాయణ తెలిపారు. ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీలో వలంటీర్లను దూరంగా ఉంచాలని ఆదేశించడంతో సంబంధిత సచివాలయాల సిబ్బందితో పంపిణీకి అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గతంలో పలువురు వలంటీర్లు సంబంధిత సెల్‌ఫోన్లలో వాట్సాప్‌లు నిర్వహించిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తే చర్యలు తప్పవన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన ప్రచారాల్లో పాల్గొంటే తొలగింపు తప్పదని చెప్పారు. వ్యతిరేక ప్రచారాలకు పాల్పడినా నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధిష్ఠానం పునరాలోచించాలి

జియ్యమ్మవలస: అరకు పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత ఎంపికపై అధిష్ఠానం పునరాలోచించాలని బీజేపీ కురుపాం నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక జయరాజు కోరారు. అర్నాడ పంచాయతీ వనజలో ఆయన సోమవారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఆమె ఎస్టీ కాదని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చినా ఎంపీగా ఎంపిక చేయడం సమంజసం కాదన్నారు. తనతో పాటు మరో నలుగురు ఆశావహుల్లో ఎవరికి సీటు ఇచ్చినా సిద్ధమేనన్నారు. మూడురోజుల్లోగా స్పష్టత ఇవ్వకుంటే భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన జేఏసీ నాయకుడు గిరి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆగూరు వైకుంఠరావు, ఎస్ఎస్ నాయుడు, సీనియర్ నాయకులు నడుకూరు దూళికేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు దోచిపెట్టారు: సంధ్యారాణి

సాలూరు: జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిధులను తన అనుచరులకు దోచిపెట్టారని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. పట్టణంలోని 28వ వార్డు, 11వ వార్డుల్లో ఆమె సోమవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు మార్చి 16-30 తేదీల మధ్య ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్ దోచి పెట్టారనిఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిమ్మాది తిరుపతిరావు, వాడాడ శోభారాణి, రమేష్ పట్నాయక్, తాతాజీ, భీమారావు, డబ్బి కృష్ణ, రెడ్డి ధర్మ పాల్గొన్నారు.



గరెళ్లవలసలో నిరసన తెలుపుతున్న వేతనదారులు

ఉపాధి బిల్లులు చెల్లించాలని నిరసన

పాచిపెంట: ఉపాధి బిల్లులు తక్షణమే చెల్లించాలంటూ సోమవారం గరెళ్లవలసలో వేతనదారులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పనిచేసిన 14 రోజులకే బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి చట్టంలో ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని ఈశ్వరరావు ఆరోపించారు. ఎర్ర జెండా నాయకత్వంలో సాధించుకున్న ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే ఆలోచనలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. ఉపాధి బిల్లులు చెల్లించి పనిదినాలు పెంచాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వేతనదారులు గరెళ్ల సావిత్రి, పైల పోలమ్మ, పి.లక్ష్మి, పి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నియమావళిని ధిక్కరిస్తే చర్యలు

● గరుగుబిల్లి ఎంపీడీవో పైల సూర్యనారాయణ

గరుగుబిల్లి: ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పైల సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర, సంతోషపురం, పెద్దూరు, గరుగుబిల్లి, తదితర ప్రాంతాల్లో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలించరాదన్నారు. పరిమితికి మించి నగదును తీసుకువెళ్లినట్లయితే విధిగా ఆధారాలు చూపించాలన్నారు. గ్రామాల్లో ఘర్షణలకు తావులేకుండా స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఈ పరిశీలనలో తనిఖీ బృంద సిబ్బంది బి.గౌరీశంకరరావు, ఎస్.రాజశేఖర్, పోలీస్ సిబ్బంది కె.శంకరరావు, సీహెచ్ ప్రకాష్, కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ, పోలీస్ సిబ్బంది



మాట్లాడుతున్న తహసీల్దార్ జయ ప్రకాష్

పోలింగ్ కేంద్రాలు సిద్ధంచేయాలి

● వీరఘట్టం తహసీల్దార్ జయప్రకాష్

వీరఘట్టం: పోలింగ్ కేంద్రాలు ఎన్నికలకు సిద్ధం చేయాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ వీఎల్వోలను ఆదేశించారు. సోమవారం వీరఘట్టం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ కేం ద్రాల్లో మౌలిక వసతులు సరిచూసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో కొత్తగా ఓటు నమోదు చేయించుకునేవారికి ఫారం-6 దరకాస్తులు అందించాలని పేర్కొన్నారు. పోలింగ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. మోడల్ కోడ్ అమలులో ఉన్నంతున నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, పర్యవేక్షించాలన్నారు. వలంటీర్లు దగ్గర నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులను రికవరీ చేశామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ, ఎం.లక్ష్మనాయుడు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.